సాక్షి
కామారెడ్డి
గురువారం । 31 । అక్టోబర్ । 2024



బీఆర్ఎస్ విజయం
ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచకుండా అడ్డుకోవడంలో విజయం సాధించామని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.
- 9లో ▸



స్వచ్ఛతకు మారుపేరు..
విజయ పాలు స్వచ్ఛతకు మారుపేరని పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ అమిత్‌రెడ్డి పేర్కొన్నారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.3 /21.1
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

'గృహహింస బాధితులకు అండగా ఉంటాం'



కామారెడ్డి అర్బన్/కామారెడ్డి టౌన్: గృహహింస బాధితులకు అండగా ఉంటామని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి పేర్కొన్నారు. బుధవారం సఖి కేంద్రంలో నిర్వహించిన న్యాయసేవ సదస్సులో ఆమె పాల్గొన్నారు. బాధిత మహిళలతో మాట్లాడారు. సఖి కేంద్రానికి సంబంధించి కోర్టులో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మహిళకు న్యాయం జరిగేలా చట్టం సహకరిస్తుందన్నారు. కుటుంబాలలో కలహాలు రాకుండా మహిళలు చూసుకోవాలన్నారు. భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గృహహింస కేసుల్లో ఇరువర్గాలను పిలిచి గౌరవమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం కల్పిస్తామని న్యాయమూర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం నిర్వాహకురాలు భారతి, లీగల్ కౌన్సిలర్ ముదాం నవీన్, సఖి సపోర్ట్ ఎన్జీవో పద్మపాణి, సొసైటీ సమన్వయకర్త అరుణిమ తదితరులు పాల్గొన్నారు.

'సదరం' తేదీలు ఖరారు

కామారెడ్డి టౌన్: దివ్యాంగుల నిర్ధారణ కోసం నవంబర్ నెలకు సంబంధించిన సదరం క్యాంపుల తేదీలను ఖరారు చేశారు. ఈ విషయమై జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల 13, 20, 27 తేదీలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్థోపెడిక్, చెవిటి, మూగ, మానసిక దివ్యాంగులు స్థానిక మీ సేవ కేంద్రాలలో స్లాట్ బుక్ చేసుకుని సదరం శిబిరానికి రావాలని సూచించారు.

రేపు కబడ్డీ పోటీలు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి కబడ్డీ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ -19 బాలుర విభాగంలో నిర్వహించే పోటీలకు క్రీడాకారులు తమ ఒరిజినల్ బోనఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం సమాధికి వినతి



బాన్సువాడ: ఏళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయని ప్రభుత్వ తీరును నిరసిస్తూ బాన్సువాడలో పలువురు విద్యార్థులు బుధవారం సమాధికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రవీందర్‌గౌడ్, దత్తు, నిఖిల్‌గౌడ్, రాఘవ, మహేందర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ జాబితా విడుదల

కామారెడ్డి టౌన్: కేజీబీవీలలో తాత్కాలిక పద్ధతిపై అకౌంటెంట్ పోస్టుల భర్తీకి సంబంధించి మెరిట్ జాబితాను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో ఉంచారు. ఈ విషయాన్ని డీఈవో ఎస్.రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. www.deokamareddy.in వెబ్‌సైట్‌లోనూ జాబితాను పొందుపరిచామని పేర్కొన్నారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే శుక్రవారం డీఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: సెట్విన్ ఆధ్వర్యంలో వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ సమన్వయకర్త సయ్యద్ మొయినుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల్లో చేరిన వారికి ప్రభుత్వం 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 73861 80456, 79891 59121 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



గోపాలపేటలో మధ్యలో నిలిచిపోయిన ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు

అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంతో కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రూ. 2 వందల కోట్లకుపైనే బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడిగా బిల్లులు రాకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

ఒత్తిడిలో గుత్తేదారు!

- రెండేళ్లుగా మంజూరు కాని బిల్లులు
- జిల్లాలో పెండింగ్‌లో రూ. 200 కోట్లకుపైనే..
- అప్పుల ఊబిలో కాంట్రాక్టర్లు
- వడ్డీలు చెల్లించలేకపోతున్నామని ఆవేదన

జిల్లాలో పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖలతో పాటు పబ్లిక్ హెల్త్, మున్సిపల్, సోషల్ వెల్ఫేర్, మన ఊరు మనబడి తదితర విభాగాలకు సంబంధించిన అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కాంట్రాక్టు పనుల్లో నాలుగు డబ్బులు సంపాదించాలన్న ఆశతో అప్పులు చేసి మరీ పలువురు కాంట్రాక్టర్లు పనులు చేశారు. రోడ్లు, వంతెనలు, కల్వర్టులు, డ్రెయినేజీలు, స్కూల్ భవనాలు నిర్మించినవారు ఏళ్లుగా బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. రెండుమూడేళ్లుగా ప్రభుత్వ ఖజానాలో నిధుల కొరత ఏర్పడడంతో బిల్లులు సరిగా మంజూరు కావడం లేదు. దీంతో చాలామంది కాంట్రాక్టర్లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరైతే మానసికంగా దెబ్బతిని ఆస్పత్రుల పాలవుతున్నారు. గత ప్రభుత్వం 'మన ఊరు.. మన బడి' కార్యక్రమాన్ని ఆర్భాటంగా ప్రారంభించింది. జిల్లాలో 352 స్కూళ్లలో వివిధ పనులకుగాను రూ.183 కోట్లు మంజూరు చేసింది. చాలాచోట్ల పాత భవనాలు కూల్చి కొత్తవి నిర్మించడానికి పనులు చేపట్టారు. కొన్నిచోట్ల స్లాబులు వేసి బిల్లులు రాక పనులు నిలిపివేశారు. మరికొన్ని చోట్ల పిల్లర్ల దశలో నిలిచాయి. ఇంకొన్నిచోట్ల పనులు గదుల నిర్మాణం జరిగినా, ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్ వంటి పనులు చేయలేదు. చాలాచోట్ల పనులు చేసిన వాళ్ల బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో స్కూల్ భవనం నిర్మించిన గుత్తేదారు బిల్లులు రాకపోవడంతో భవనానికి తాళం వేసి నిరసన తెలిపాడు. బిల్లుల కోసం పలువురు ప్రజావాణిలోనూ మొరపెట్టుకుంటున్నారు. మన ఊరు మన బడికి సంబంధించి రూ.30 కోట్ల పైనే బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది.

పంచాయతీరాజ్, ఇరిగేషన్, రోడ్లు భవనాల శాఖల్లో రూ. వందల కోట్ల విలువైన పనులు చేసిన ఎంతో మంది ఇబ్బందిపడుతున్నారు. బ్రిడ్జీలు, రోడ్లు, ఇతర భవనాలు నిర్మించిన కాంట్రాక్టర్లు చాలా మంది అప్పులపాలయ్యారు. బడా కాంట్రాక్టర్లు ఏదో రకంగా నెట్టుకువస్తుండగా, చిన్నచిన్న కాంట్రాక్టర్లు అవస్థలు పడుతున్నారు. నీటి పారుదల శాఖలోనూ చాలా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మున్సిపల్‌లో కూడా పరిస్థితి అలాగే ఉంది. పలుకుబడి ఉన్న వారు జనరల్ ఫండ్ నుంచి డైవర్ట్ చేసుకుని బిల్లులు తీసుకుంటుండగా, మిగతా వారు బిల్లులు చేతికిరాక అవస్థలు పడుతున్నారు.

వడ్డీల భారం..

రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బతినడంతో కొందరు కాంట్రాక్టు పనుల వైపు అడుగులు వేశారు. ఇక్కడ కూడా వారికి ఇబ్బందులే ఎదురవుతున్నాయి. భూముల దందా అచ్చిరాలేదని ఇటు వస్తే ఇక్కడ కూడా అలాగే ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు పని కోసం ఫైనాన్సుల్లో అప్పులు తెచ్చిన చాలామంది వడ్డీ భారం పెరిగిపోయి అవస్థలు పడుతున్నారు. కొందరైతే ఆస్తులు అమ్ముకుని అప్పులు కడుతున్నారు. మరికొందరు అప్పులు తీర్చే మార్గం లేక మనోవేదనకు గురవుతున్నారు. అనవసరంగా కాంట్రాక్టు పనులు చేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్కారు పనులంటేనే జంకే పరిస్థితి

కొత్తగా మంజూరవుతున్న పనులు చేయడానికి చాలామంది ముందుకు రావడం లేదు. బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితుల్లో పనులు చేయడానికి ఆచితూచి అడుగేస్తున్నారు. చివరికి ఉపాధి హామీ పథకంలో మెటల్ కాంపోనెంట్ కింద సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించడానికి కూడా చాలామంది ఆసక్తి చూపడంలేదు. కోటాకు మించి అదనంగా పనులు జరిగాయి. దీంతో బిల్లులు వస్తాయోలేదో తెలియని పరిస్థితుల్లో పనులు చేయడానికి వెనకడుగు వేశారు. ఎలాగోలా మార్చి నెలాఖరులోగా పనులు చేసిన వారంతా ఇప్పటికీ బిల్లులు రాలేదని చెబుతున్నారు. ఏ నిధులైనా సరే పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) నిధులు మంజూరైనా వాటికి కూడా చెల్లింపులు జరగడం లేదని తెలుస్తోంది. తమకు గడ్డుకాలం నడుస్తోందని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.



నిజాంసాగర్ మండలంలోని కొనుగోలు కేంద్రం వద్ద వడ్లను బస్తాల్లో నింపుతున్న హమాలీలు

ధాన్యం.. వ్యాపారుల పాలు

- కొనుగోలు కేంద్రాల్లో ప్రారంభం కాని తూకాలు
- వ్యాపారులకు విక్రయిస్తున్న రైతులు

నిజాంసాగర్: జిల్లాలో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరుతోంది. అయితే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఇప్పటికీ తూకాలు ప్రారంభించ లేదు. ఎప్పుడు ప్రారంభిస్తారన్న విషయమై స్పష్టత లేదు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన తాటి పత్రులు, గన్నీ సంచులు అందుబాటులో లేవు. తాగునీటి సదుపాయం కూడా లేదు. మరోవైపు వాతావరణంలో వస్తున్న మార్పులు అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వర్షం పడి ధాన్యం తడుస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు.

వడ్లు తడవకుండా ఉండేందుకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద టాపర్లను అద్దెకు తీసుకుని కప్పుతున్నారు. అయితే ప్రభుత్వం ధాన్యం తూకాలు ప్రారంభించకపోవడంతో వ్యాపారులు రంగంలోకి దిగారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే వరిధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తుందో తెలియకపోవడంతో పలువురు రైతులు వ్యాపారులకే అమ్ముకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

'డివైడర్ కూల్చివేతపై చర్యలు తీసుకోవాలి'



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై అక్రమంగా డివైడర్‌ను కూల్చివేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ అనుమతి లేకుండా డివైడర్‌ను కూల్చివేయడమే కాకుండా సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని ఎత్తుకెళ్లారన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామన్నారు. కార్యక్రమంలో బల్దియాలో బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ హఫీజ్ బేగ్, కౌన్సిలర్లు పిట్ల వేణు, నజీరొద్దీన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్, నాయకులు లక్ష్మీనారాయణ, గైని శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లు బ్యాంకు పూచీకత్తు ఇవ్వాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: మిల్లింగ్ చేసేందుకు ఇచ్చే ధాన్యానికి సంబంధించి రైస్ మిల్లర్లు బ్యాంక్ పూచీకత్తు ఇవ్వాల్సి ఉంటుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024–25 నేడాదికి వరి ధాన్యాన్ని తీసుకునే ప్రతి రైస్ మిల్లర్ తమ వ్యక్తిగత బ్యాంకు పూచీకత్తును తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి తమ మిల్లులకు వచ్చే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మిల్లర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.విక్టర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం రాజేందర్, ఏఎస్‌వో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు దీపావళి శోభ



జిల్లాకేంద్రంలోని మార్కెట్‌లో దీపెంతలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

- నేడు దివ్వెల పండుగ

కామారెడ్డి టౌన్: దీపావళి పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మార్కెట్లలో బుధవారం సందడి నెలకొంది. జిల్లాలో గురువారం దివ్వెల పండుగ జరుపుకోనున్నారు. పండుగ సందర్భంగా పట్టణంలో ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. పూజా సామగ్రి, దీపెంతలు, పూలు ఇతర సామగ్రి కొనుగోళ్లతో రద్దీ నెలకొంది. సుభాష్ రోడ్, జేపీఎన్ రోడ్, మాయాబజార్, సిరిసిల్ల రోడ్, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ ప్రాంతాలలో వ్యాపారులు జోరుగా సాగాయి.



లక్ష్మీదేవి చిత్రపటాలను కొనుగోలు చేస్తూ..



దీపెంతలు కొనుగోలు చేస్తూ..



గుమ్మడి కాయలు కొనుగోలు చేస్తూ..

నిబంధనలు తూచ్!

- ఆస్పత్రులు, స్కానింగ్, డయాగ్నోస్టిక్ కేంద్రాలలో తనిఖీలు కరువు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న నిర్వాహకులు
- లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నా చర్యలు నామమాత్రం
- వైద్యశాఖపై విమర్శల వెల్లువ



కామారెడ్డి టౌన్: జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్, డయాగ్నోస్టిక్ కేంద్రాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. స్కానింగ్ కేంద్రాలలో యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి. డయాగ్నోస్టిక్ సెంటర్‌లలో తప్పుడు ఫలితాలు ఇస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అయినా ఆయా ఆస్పత్రులు, కేంద్రాలపై చర్యలు తీసుకోవడంలో వైద్యఆరోగ్య శాఖ అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. రెగ్యులర్‌గా తనిఖీలు చేపట్టకపోవడంతో ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకుల ఇష్టారాజ్యానికి అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ఇటీవల వెలుగులోకి వచ్చిన లింగ నిర్ధారణ, స్కానింగ్ యంత్రాల సీజ్ కేసు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. 2011లో రాజంపేట ఆస్పత్రిలో ఓ వైద్యుడి పేరిట రిజిస్ట్రేషన్ అయి ఉన్న స్కానింగ్ యంత్రాన్ని చాలాకాలంగా జిల్లా కేంద్రంలో వినియోగిస్తున్నారని విచారణలో తేలింది. మిగతా రెండు స్కానింగ్ యంత్రాలను సైతం నిబంధనలకు విరుద్ధంగానే వినియోగించారు. ఈ ఘటనలతో ఇన్నేళ్లుగా ఆ ఆస్పత్రి, స్కానింగ్ యంత్రాలపై వైద్యశాఖ పర్యవేక్షణ కరువైందని తేలిపోయింది. ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్‌లు, రెన్యువల్‌కు సంబంధించి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ అన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అనుమతుల మంజూరులో అధికారులు నిబంధనలను పట్టించుకోవడం లేదు. దీంతో ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్‌లలో నిర్వాహకుల ఇష్టారాజ్యం నడుస్తోంది. గోదాంరోడ్‌లోని రెండు స్కానింగ్ కేంద్రాలలో, ఓ మెటర్నిటీ ఆస్పత్రిలో లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయన్న ప్రచారం ఉంది. అలాగే ఎలాంటి అర్హతలు లేనివారు స్కానింగ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఎలాంటి అర్హతలు లేనివారు పరీక్షలు చేస్తుండడంతో డయాగ్నోస్టిక్ సెంటర్‌లలో తప్పుడు ఫలితాలు వస్తున్నాయి. ఈ అంశాలపై ఫిర్యాదులు వస్తున్నా వైద్యశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

తనిఖీలు లేకుండానే..

జిల్లాలో 70కిపైగా ప్రైవేట్ ఆస్పత్రులున్నాయి. 18 స్కానింగ్ సెంటర్లు, 100కుపైగా డయాగ్నోస్టిక్ కేంద్రాలు నడుస్తున్నాయి. జిల్లాలో ఆస్పత్రులు, స్కానింగ్, డయాగ్నోస్టిక్స్, ఎక్స్‌రే సెంటర్‌ల రిజిస్ట్రేషన్‌లు, రెన్యువల్‌కు సంబంధించి ఏడాది కాలంలో గత డీఎంహెచ్‌వో 56 ఫైళ్లపై సంతకాలు చేసినట్లు తెలిసింది. ఆయా ఆస్పత్రులు, సెంటర్లను ఎలాంటి తనిఖీలు చేయకుండానే అనుమతులు ఇచ్చారని తెలుస్తోంది. అనుమతుల కోసం భారీ మొత్తంలో చేతులు మారాయన్న ఆరోపణలు వచ్చాయి. లింగ నిర్ధారణ పరీక్షలకు కేరాఫ్‌గా నిలుస్తున్న ఆస్పత్రి, స్కానింగ్ కేంద్రాలకు అనుమతుల విషయంలోనూ భారీగా డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఓ ఉద్యోగి మధ్యవర్తిగా వ్యవహరిస్తూ ఎలాంటి తనిఖీలు లేకుండానే అనుమతులు ఇప్పిస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆస్పత్రులు, స్కానింగ్, డయాగ్నోస్టిక్ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు చేస్తున్నాం

జిల్లాలోని ఆస్పత్రులు, స్కానింగ్, డయాగ్నోస్టిక్ కేంద్రాలను తరచూ తనిఖీ చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాటిపై చర్యలు తీసుకుంటున్నాం. అందరూ నిబంధనలు పాటించాల్సిందే.

– చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో

రైతులను మోసం చేసిన సర్కారు

- హామీల అమలులో విఫలం
- కాంగ్రెస్‌పై మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే విమర్శలు
- మద్నూర్‌లో రైతు ధర్నా



ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, బీఆర్ఎస్ నాయకులు

మద్నూర్: రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేసిందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే విమర్శించారు. మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహించారు. మద్నూర్‌లో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా సింధే మాట్లాడుతూ అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందన్నారు. హామీలను అమలు చేయకుండా రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రైతు రుణాలు మాఫీ కాలేదని, రైతు భరోసా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలని, రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసేంత వరకు పోరాడుతామన్నారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికలలో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కంచిన్ హన్మండ్లు, విజయ్, సురేశ్, రవి, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదనపు కలెక్టర్‌కు అభినందనలు



కామారెడ్డి అర్బన్: అదనపు కలెక్టర్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వి.విక్టర్‌ను తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లా పరిస్థితులపై మాట్లాడారు. టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బి.సాయిలు, కేంద్ర సంఘం కార్యదర్శి ఎం.నాగరాజు, ప్రతినిధులు దేవరాజు, చిన్న పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపు బీకేఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

కామారెడ్డి అర్బన్: వడ్ల కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) ఆధ్వర్యంలో నవంబర్ 1న ఉదయం 11 గంటలకు జిల్లాలోని అన్ని తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నా చేయనున్నట్లు బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరబోసిన ధాన్యం వర్షాలతో తడిసిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. నిరసనల్లో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు.

షబ్బీర్ అలీని కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, చంద్రశేఖర్ దంపతులు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించి డ్రైఫ్రూట్స్, పండ్లను అందజేశారు.

చిత్రపటం అందజేసిన బ్రహ్మానందం



కామారెడ్డి టౌన్: మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ దంపతులు ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందంను బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం తన చేతితో స్వయంగా గీసిన వేంకటేశ్వరుడి చిత్రపటాన్ని చైర్‌పర్సన్ దంపతులకు జ్ఞాపికగా అందజేశారు.

స్వచ్ఛతకు మారుపేరు విజయ డెయిరీ

- పాలలో ఏమాత్రం కల్తీకి ఆస్కారం లేదు
- రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు మేలు చేస్తోంది
- పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య చైర్మన్ అమిత్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి, అమిత్‌రెడ్డి

నిజామాబాద్ రూరల్: విజయ డెయిరీ పాలు స్వచ్ఛతకు మారుపేరని, ఏ మాత్రం కల్తీకి ఆస్కారం ఉండదని రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి సారంగాపూర్‌లోని విజయ డెయిరీని చైర్మన్ అమిత్‌రెడ్డి బుధవారం సందర్శించారు. అధికారులతో మాట్లాడి పాల సేకరణ, విక్రయాల వివరాలు తెలుసుకున్నారు. పాల శీతలీకరణ ప్రక్రియను పరిశీలించి, పాడి రైతులతో భేటీ అయి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి రైతులకు మేలు చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమకు తోడ్పాటునందిస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం రేవంత్‌రెడ్డి రూ.50కోట్ల నిధులు విడుదల చేశారని, అదనంగా మరో రూ.10కోట్ల బకాయిలను పాడి రైతులకు చెల్లించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాల కారణంగానే విజయ పాల విక్రయాలు గణనీయంగా పెరిగాయని, మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ప్రతి రోజూ విజయ డెయిరీ యూనిట్ల ద్వారా 4.40 లక్షల లీటర్ల పాలను సేకరిస్తుండగా, 3.20 లక్షల లీటర్ల పాలు మాత్రమే అమ్ముడవుతున్నాయని తెలిపారు. మిగిలిన పాలను మిల్క్ పౌడర్‌గా, వెన్నగా మార్చేందుకు చిత్తూరు జిల్లాకు పంపించాల్సి వస్తుండడంతో సంస్థపై ఆర్థిక భారం పడుతోందన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో పాడి రైతులకు అత్యధిక ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. పాడి పరిశ్రమలో నష్టాలను నివారిస్తూ, లాభాల బాటలో పయనింపజేసేందుకు ఎలాంటి చర్యలు చేపడితే బాగుంటుందో రైతు సంఘాలు కూడా ఆలోచనలు చేయాలని సూచించారు.

పూర్తి సహకారం అందిస్తా

విజయ డెయిరీ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. పాలు వినియోగించే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విజయ డెయిరీ పాలనే వినియోగించాలని సూచించారు.

పాడిరైతులకు తోడ్పాటునందించాలి

జిల్లాలో వినియోగం అవుతున్న పాలలో కేవలం పది శాతం మాత్రమే విజయ డెయిరీ పాల ను వినియోగిస్తున్నారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ముల్కనూరులో రైతులు సమాఖ్యగా ఏర్పడి సమష్టి కృషితో సత్ఫలితాలు సాధించారని, అదే స్ఫూర్తితో జిల్లాలోని పాడి రైతులు కూడా కృషి చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, సారంగాపూర్ విజయ డెయిరీ యూనిట్ ఉప సంచాలకులు నాగేశ్వర్‌రావు, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు జగన్నాథచారి, పాడి రైతుల సంఘం ప్రతినిధులు సురేశ్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పూలు అమ్మొచ్చు.. బైక్ నిలపొద్దు!!



దీపావళి నేపథ్యంలో సందడిగా మారిన రోడ్లపై ట్రాఫిక్ పోలీసులు విచిత్రమైన రూల్స్ అమలు చేస్తున్నారని వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై పూలు, ఇతర సామగ్రి విక్రయిస్తున్నా పట్టించుకోని పోలీసులు.. కొనుగోలుదారులు బైక్‌లు నిలిపితే ఫొటోలు తీస్తూ చలాన్లు రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూలు, పూజా సామగ్రి కొనేందుకు వచ్చిన తాము బైక్‌లు ఎక్కడ నిలపాలో పోలీసులే చూపించాలని వారు అంటున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సీనియర్ మహిళ, పురుషుల విభాగాల్లో ఎంపికలను నవంబర్ 2న నిర్వహించనున్నట్లు నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మానస గణేశ్, శ్యామ్ బుధవారం తెలిపారు. ఆర్మూర్‌లోని విజయ్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో ఎంపికలు ఉంటాయని, ఎంపికైన క్రీడాకారులను హనుమకొండలో నిర్వహించనున్న 70వ తెలంగాణ రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు.

రేపు సాఫ్ట్, బేస్‌బాల్ జట్ల ఎంపిక

నిజామాబాద్‌నాగారం: స్కూల్ గేమ్స్ అండర్–19 సాఫ్ట్‌బాల్, బేస్ బాల్ ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లను నవంబర్ 1న ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ టి రవికుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆర్మూర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర కళాశాలలో ప్రిన్సిపాల్ పూర్ణచందర్ ఆధ్వర్యంలో బాలుర ఎంపికలు, సుద్దపల్లి సాంఘిక సంక్షేమ కళాశాల మైదానంలో ప్రిన్సిపాల్ నళిని ఆధ్వర్యంలో బాలికల ఎంపికలు ఉంటాయని వివరించారు.

లక్ష్యసాధనలో విద్యార్థులు ముందుకెళ్లాలి



క్రీడాకారులతో జడ్జి సునీత కుంచాల

డిచ్‌పల్లి: విద్యార్థినులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని అప్పుడే మంచి ఫలితాలు సాధించొచ్చని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలను న్యాయమూర్తి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గురుకులాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఆడపిల్లలకు ఆత్మరక్షణ చాలా ముఖ్యమని, అందుకోసం శిక్షణ తీసుకుని తమను తాము కాపాడుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఆడపిల్లలకు ఏదైనా సమస్య ఉంటే 1098కు ఫోన్ చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండని వారు వాహనాలు నడిపిస్తే ప్రకారం శిక్షార్హులన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రాజశ్రీ, మండల ప్రత్యేకాధికారి యోహాన్, ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ ప్రభాకర్, ఎస్సై మహ్మద్ షరీఫ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నళిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. న్యాయమూర్తి సునీత కుంచాలపై ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని కళాశాల ప్రిన్సిపాల్ నళిని ఫొటోఫ్రేమ్‌గా చేయించి అందజేశారు.

ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు ఎంపిక



క్రీడాకారుడితో కోచ్ ప్రతాప్‌దాస్ తదితరులు

దోమకొండ: ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు దోమకొండకు చెందిన నవీన్ ఎంపికైనట్లు అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ బుధవారం తెలిపారు. అండర్–19 విభాగంలో నవీన్ ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ.. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నవీన్ ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. నవంబర్ 11న గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలో నవీన్ పాల్గొంటాడని ఆయన పేర్కొన్నారు. పలువురు అభినందనలు తెలియజేశారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు సందీప్‌కుమార్



సందీప్‌కుమార్

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎంఏ తెలుగు ద్వితీయ సంవత్సరం విద్యార్థి పి.సందీప్‌కుమార్ విశ్వ విద్యాలయాల జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్, ఇన్‌చార్జి పీడీ జి.శ్రీనివాస్‌రావు తెలిపారు. తెలంగాణ విశ్వ విద్యాలయం పరిధిలోని కళాశాలల బాలుర కబడ్డీ పోటీల్లో పాల్గొన్న సందీప్‌కుమార్ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. తమిళనాడులో నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ విశ్వవిద్యాలయం తరపున పాల్గొంటారన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు..



అదెయ్‌ని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు దామోదర్ రెడ్డి, ఉపాధ్యాయులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎం.అదెయ్, అథ్లెటిక్స్(షార్ట్‌పుట్)లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు దామోదర్ రెడ్డి, పీడీ హన్మంత్ రెడ్డి తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో 68వ ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించగా.. అండర్–14 బాలుర విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అభినందించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వరప్రసాద్

కామారెడ్డి టౌన్: ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వరప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీజేఆర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చదువుకున్న వారు సైతం సైబర్ మోసాలకు గురవుతున్నారని, ప్రతీ ఒక్కరు తమ బ్యాంక్, ఇతర వివరాలను ఎవరికీ చెప్పకూడదని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ చెప్పవద్దన్నారు. కళాశాల చైర్మన్ గురువేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ గౌడ్, వైస్ ప్రిన్సిపల్ కృష్ణప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

- మూడు నెలల్లో తండ్రి, కుమారుల బలవన్మరణం
- అనాథగా మారిన తల్లి..
- చుక్కాపూర్‌లో విషాదం



ప్రవీణ్ (ఫైల్)

మాచారెడ్డి : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చుక్కాపూర్‌లో చోటు చేసుకుంది. మూడు నెలల వ్యవధిలో తండ్రి, కొడుకు బలవన్మరణానికి పాల్పడడం ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన నూనె చంద్రం (50) మూడు నెలల కిందట ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చంద్రం కుమారుడు ప్రవీణ్(25) భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురై బుధవారం తన తల్లి రాజమణి ఇంట్లో లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు నెలల వ్యవధిలో తండ్రి, కొడుకు బలవన్మరణానికి పాల్పడడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. భర్త, కొడుకు దూరం కావడంతో ప్రవీణ్ తల్లి రాజమణి అనాథగా మారింది. ఇద్దరినీ కోల్పోయి తాను ఉండేమి ఫలితమని తలబాదుకుంటూ కన్నీరుమున్నీరైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

రైలు కిందపడి మహిళ ..

ఖలీల్‌వాడి: ఆవేశంలో రైలు కిందపడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి బుధవారం తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్ ఆచన్‌పల్లికి చెందిన ఆసది సుజాత(38)కు 14 సంవత్సరాల క్రితం అర్సపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఆసది రవితో వివాహమైంది.వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.ఎప్పుడూ ఆవేశంగా ఉండే సుజాత తరచూ భర్తతో, పక్క ఇంటి వారితో గొడవపడేది. మంగళవారం రోజున సైతం గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆవేశంతో రాత్రి 9.30గంటలకు సుజాత ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. భర్త ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు.సుజాత బుధవారం ఉదయం రైలు పట్టాల పక్కన శవమై కనిపించింది. తన భార్య మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని భర్త రవి పోలీసులకు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై స్నేక్‌గ్యాంగ్ దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హబీబ్‌నగర్ లో ఓ యువకుడిపై స్నేక్ గ్యాంగ్ దాడి చేసినట్లు తెలిసింది. గ్యాంగ్‌లోని సభ్యుడి అనుమతి లేకుండా కాలనీలోకి రావొద్దని, పాతకక్షలతో యువకుడిపై దాడి చేసి, బెదిరింపులకు పాల్పడినట్లు తెలిసింది. ఈ దాడిలో గాయాలపాలైన యువకుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యులు ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎస్‌హెచ్‌వో రఘుపతిని వివరణ కోరగా.. దాడి ఘటనపై విచారణ చేపట్టినట్లు తెలిపారు.

మత్తుపదార్థాల పట్టివేత

బోధన్‌రూరల్: సాలూర అంతరాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో బుధవారం మత్తుపదార్థాలు (అల్ప్రాజోలం, క్లోరోఫాం, డైజోఫాం) పట్టుబడినట్లు బోధన్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. సాలూర చెక్‌పోస్ట్ వద్ద మహారాష్ట్ర బస్సులో తనిఖీ నిర్వహిస్తుండగా.. ఓ వ్యక్తి బ్యాగుతో పారిపోయే ప్రయత్నంచేశాడని, అతడిని పట్టుకుని విచారించగా బ్యాగులో మత్తు పదార్థాలు ఉన్నట్లు తేలిందన్నారు. మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకుని మాదకద్రవ్యాల నిరోధకచట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సాలూరలో నిషేధిత గుట్కా...

బోధన్‌రూరల్ : సాలూర అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద బుధవారం తనిఖీలు నిర్వహిస్తుండగా రూ.23వేల విలువైన నిషేధిత గుట్కా పట్టుబడినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. మహారాష్ట్రకు చెందిన అజాం అనే వ్యక్తి సాలూర నుంచి మహారాష్ట్ర వైపు బస్సులో గుట్కా ప్యాకెట్లు తీసుకెళ్తుండగా పట్టుబడ్డాడని తెలిపారు.

గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. మహారాష్ట్రలో ఎన్నికల సందర్భంగా ప్రత్యేకంగా చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

రుద్రూర్: పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారంలో కొనసాగుతున్న పేకాటస్థావరంపై బుధవారం అర్ధరాత్రి దాడి చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ.7,350 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాటాడితే సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



చింత కిషన్(ఫైల్)

కమ్మర్‌పల్లి: స్కూటీని వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందా డు. మండల కేంద్రంలోని మెట్‌పల్లి రోడ్డులో ఉన్న భారత్‌పెట్రో ల్ బంక్ వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కమ్మర్‌పల్లికి చెందిన చింత కిషన్(28) బిర్లా కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ ఇంటి నుంచే విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తన స్నేహితుడు హరీశ్‌గౌడ్‌తో స్కూటీపై మెట్‌పల్లికి వెళ్లాడు. రాత్రి సమయంలో తిరిగి వస్తూ పెట్రోల్ పోయించేందుకు కమ్మర్‌పల్లి శివారులోని భారత్ పెట్రోల్ బంక్‌లోకి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కిషన్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పండగకు అత్తారింటికి వెళ్తూ..



ప్రవీణ్(ఫైల్)

బాన్సువాడ రూరల్: మండలంలో బోర్లం గ్రామాని కి చెందిన జోగొల్ల ప్రవీణ్(25) బుధవారం బీర్కూ ర్ మండలం దామరంచ గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీపావళి పండుగకు హస్గుల్‌లోని తన అత్తగారి ఇంటికి బైక్‌పై వెళ్తుండగా దామరంచ శివారులో ఐచర్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలై ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనాస్థలానికి చేరుకొని బోరున విలపించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బీర్కూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు..



సుబ్బారావు(ఫైల్)

మాచారెడ్డి: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ప్రమాదంలో బైకర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం భవానీపేట వద్ద కామారెడ్డి – సిరిసిల్ల రోడ్డుపై చోటు చేసుకొంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

దోమకొండ మండలం అంబారీపేటకు చెందిన టీ సుబ్బారావు(36) ద్విచక్ర వాహనంపై కామారెడ్డి నుంచి అంబారిపేటకు వెళ్తుండగా, మాచారెడ్డి నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న ప్యాసింజర్ ఆటో భవానీపేట వద్ద ఢీకొట్టింది. ఈఘటనలో సుబ్బారావు అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని సాతోలి గ్రామానికి చెందిన పుట్ట హరీశ్ అనే యువకుడికి విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన హరీశ్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ట్రాక్టర్‌లోని ధాన్యాన్ని అన్‌లోడింగ్ చేస్తుండగా ట్రాలీ హైటెన్షన్ వైర్లకు తగిలిందన్నారు. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన హరీశ్‌ను కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

బాన్సువాడ: పట్టణంలోని పెద్ద హనుమాన్ మందిరం ఎదురుగా ఉన్న ఓ పాడుబడిన ఇంటి ఆవరణలో బుధవారం సాయంత్రం ఏడేళ్ల బాలికపై 50ఏళ్ల వ్యక్తి అత్యాచార యత్నం చేశాడు. బాలికకు మాయమాటలు చెప్పి పాడుబడిన ఇంట్లోకి బాలికను తీసుకెళ్లిన సమయంలో చూసిన ఓ యువకుడు ఆ వ్యక్తిని నిలదీశాడు. దీంతో ఆ వ్యక్తి తప్పయిందని అంటూ పారిపోయాడు. బాన్సువాడ పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

బోధన్ నుంచి ఎయిర్‌పోర్టుకు సూపర్ లగ్జరీ

బోధన్: శంషాబాద్ ఎయిర్‌పోర్టు బోధన్ నుంచి నవంబర్ 4వ తేదీ నుంచి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు డీఎం శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 5.30 గంటలకు బస్సు బోధన్ నుంచి బయల్దేరుతుందని, వర్ని, బాన్సువాడ, మెదక్, నర్సాపూర్, జేబీఎస్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాత్రి 12 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరి బోధన్‌కు ఉదయం 11.10 గంటలకు చేరుకుంటుందని వివరించారు. బోధన్ నుంచి ఎయిర్ పోర్టుకు ఒక్కొక్కరికి రూ.590 చార్జీ ఉంటుందని తెలిపారు.

పామూరుకు అదనంగా మరో బస్సు..

బోధన్ నుంచి పామూరుకు అదనంగా మరో బస్సును ప్రారంభించనున్నట్లు డీఎం తెలిపారు. ఈ సర్వీసు ప్రతి రోజూ బోధన్ బస్టాండ్ నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం6.15 గంటలకు పామూరుకు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి అదేరోజు సాయంత్రం 7 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి ఉదయం 8.45 గంటలకు బోధన్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.